న్యూజెర్సీ కథల పోటీల్లో ఉత్తమంగా ఎంపికై
రు. 1000 బహుమతి గెల్చుకున్న కథ

# ఊకదంపుడు

## వల్లూరు శివప్రసాద్

రంగారావు పేరు ఈమధ్య తరచు విశేషంగా వార్తాపత్రికల్లో పడుతూ వుంది. దేశ ఆర్థిక, రాజకీయ విషయాల దగ్గర్నుండీ సాహిత్య, సాంస్కృతిక రంగాలదాకా అనర్గళంగా ఉపన్యాసాలిస్తున్నాడు. సభాధ్యక్షుడిగా, ముఖ్య అతిథిగా, వక్తగా రకరకాల పాత్రధారణతో ఉపన్యాసాలు దంచుతున్నట్టున్నాడు.

అతను పాల్గొనే సభలన్నింటి ఆహ్వానాలు నాకు తప్పకుండా అందుతూనే వున్నాయి. రెండు మూడుసార్లు ఆఫీసుకు తనే స్వయంగా ఫోన్‌చేసి ఆహ్వానించడం కూడా జరిగింది. నిజం చెప్పాలంటే వెళ్ళడం కుదరక కాదుగాని వెళ్ళాలన్న ఆసక్తే నాకు అంతగా లేకపోయింది. అనుకోకుండా బజార్లో తారసపడినప్పడల్లా ఏ ఒక్క సభకూ రానందుకు రంగారావుతో నిష్ఠూరాలు తప్పడంలేదు.

ఉన్నట్టుండి ఇంత ప్రాధాన్యత రంగారావుకి ఎలా వచ్చిందన్నది నాకు ఒకపట్టాన అంతుబట్టలేదు. కొద్ది చదువు, చిన్నపాటి వ్యాపారంతో అతనింత పబ్లిక్ ఫిగర్ కావడం ఈ రోజుల్లో సాధ్యమయ్యే పని కాదు. నిలకడ మీద తేలిన నిజం ఏమిటంటే, అచ్చోసిన ఆబోతులా దేశం మీద పడి తిని తిరుగుతూ ఎందుకూ కొరగాకుండా పోయాడనుకున్న రంగారావు బావమరిదొకడు రాజకీయాలకు పనికొచ్చి కులం కలిసొచ్చి శాసనసభ్యుడయ్యాడు. కాకలు తీరిన రాజకీయ ప్రత్యర్థిని ఓడించాడన్న ముచ్చటకొద్దీ అధికార పార్టీ ఇతగాడికి ఒక మంత్రి పదవీ కట్టబెట్టింది. మంత్రిగారి జిల్లా పర్యటనలో భాగంగా రంగారావు ఇంట విందుభోజనాలారగింపుతో ఇద్దరి చుట్టరికం బహుళ ప్రచారం కావడంతో మావాడు రంగంలోకి వచ్చాడు. స్కూళ్ళు, కాలేజీలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, సాహిత్య సంస్థలు ఇలా ఒకళ్ళనేమిటి నానాజాతి సంఘాలవాళ్ళు రంగారావుని మంత్రిగారి ప్రతిరూపంగా భావిస్తూ ఉపన్యాసాలతో ప్రజల్ని తరింపజేయాలని పోటీలుపడుతున్నారు.

ఒకరోజు మ్యాట్నీ సినిమా చూసి, సరదాగా ఇంటిదాకా నడవడం ఆరోగ్యానికి మంచిదిలెమ్మని రెండు కాళ్ళకు పనిచెప్పాను.

హఠాత్తుగా నా పక్కన కీచుమంటూ అంబాసిడర్ కారొకటి సినిమా ఫక్కీలో ఆగింది. అందులోనుంచి రంగారావు హీరోలా దిగాడు.

"హలో చంద్రమౌళీ! ఎక్కడిదాకా?" అంటూ కౌగలించుకున్నంత పనిచేశాడు.

"ఇంకెక్కడికి, ఇంటికే!" అన్నాను తత్తరపడి.

"డ్రాప్‌చేసి వెళ్తాన్లే, ఎక్కు" అన్నాడు అభిమానంగా.

"అబ్బే! నిమిషాల మీద ఇంటికెళ్ళాల్సిన అర్జంటు పనులంటూ ఏం లేవు. షికారుగా వచ్చానంతే" అన్నాను లిఫ్ట్ అవసరం నాకేమాత్రం లేనట్టు.

"ఇంకేం! అర్జంటు పనులేం లేవంటున్నావుగా, నాతో రా! జస్ట్ ఒక గంటలో వెళ్లొచ్చు" అంటూనే తను కారెక్కి అక్టోపస్‌లా నన్ను లోనికి లాగడం డోర్ వేయడం క్షణాల్లో జరిగిపోయింది.

మాటు చూసుకోకుండా గోతిలో పడ్డట్టయింది నా పని.

ఒక సభలో ప్రసంగించడానికి వెళ్తున్నట్టు దారిలో చెప్పేడు. చివరకు ఈ రకంగానైనా నేను సభకు వస్తున్నందుకు తెగ సంతోషిస్తూ, ఎవరినీ కాదనలేని అశక్తతతో, తీరికలేక తనెంత సతమతమవుతున్నదీ సోదాహరణంగా చెప్పాడు.

రంగారావుకి సన్నిహితుడిగా గుర్తించి కాబోలు నాకూ సకల మర్యాదలు చేశారు నిర్వాహకులు. అప్పటికది నాకు గొప్పగానే అనిపించింది.

అదొక హేతువాద సంఘం వాళ్ళ సభ. వేదిక మీదకు వెళ్ళబోతూ, తనే ఇంటివద్ద డ్రాప్ చేస్తానని, తన ఉపన్యాసం శ్రద్ధగా విని అభిప్రాయం చెప్పాలని చెవిలో వూదాడు.

"ఇందుగలడందు లేడని, సందేహమ్ము వలదు. చక్రి సర్వోపగతుం, డెందెందు వెదకిచూచిన, అందందే కలడు... అంటున్న భక్త శిఖామణుల్ని అడుగుతున్నాను... ఏడీ, ఆ దేవుడ్ని చూపించమంటూ! దీనజనుల ఆర్తనాదాలలో కనిపిస్తున్నాడా! పేదల స్వేదంలో కనిపిస్తున్నాడా! శ్రమజీవుల దోపిడీలో కనిపిస్తున్నాడా! ఆకలితో అలమటిస్తున్న కోట్లాది జనుల హాహాకారాలలో కనిపిస్తున్నాడా? చూపించండి!"

హాలంతా ఒక్కసారి చప్పట్లతో మారుమ్రోగింది.

"మతం మత్తుమకుంటే దేవుడు ఒక



మాదకద్రవ్యం. ఈ బడుగు వర్గాల కళ్ళకు కర్మసిద్ధాంతమనే గంతలు కట్టి దోచుకోవడానికి ఆడుతున్న నాటకమే ఇదంతా..."

ఇలా రంగారావు ఉపన్యాసం సుమారు గంటసేపు సభాసదుల కరతాళధ్వనుల మధ్య ఏకధాటిగా సాగింది. ఆ వాగ్ధాటికి నేనూ ముగ్ధుడ్నయ్యాను.

"బాగా మాట్లాడావోయ్! నీలో ఇంత గొప్ప ఉపన్యాసకుడు దాగున్నాడని ఇవ్వాళే తెలుసుకున్నాను" అన్నాను ప్రశంసగా కారులో తిరిగొస్తూ.

"నా ఉపన్యాస ధోరణిలో ఏమన్నా లోటుపాట్లుంటే చెప్తావనే, నువ్వు నా సభలకు రావాలని కోరుకునేది" అంటూ ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

నెల గడిచాక మరో సభకు నిర్వాహకుడి బలవంతంమీద వెళ్ళాల్సి వచ్చింది. ఆ సభలోనూ రంగారావు ప్రధాన వక్త కావడం నన్ను ఆశ్చర్యపరచింది. అది ఆస్తికుల సభ.

"ఇందుగలడందు లేడని, సందేహమ్ము వలదు చక్రి సర్వోపగతుం, డెందెందు వెదకిచూసిన అందందే గలడు దానవాగ్రణి ... అన్నాడు భక్త ప్రహ్లాదుడు. నిజమే! భగవంతుడు సర్వాంతర్యామి. ఈ కుర్చీలో గాని, టేబుల్లో గాని, ఈ మైకులో గాని, మైకు చేసే శబ్దంలో గాని ఎందెందు వెదకి చూసినా అందందే వుంటాడు.





ఏదీ చూపించండి అని వితండవాదులనొచ్చు. సకల చరాచర ప్రాణికోటికి జీవాధారమైన గాలిని ఎవరైనా చూడగలిగారా! కనపడలేదు కనుక నమ్మం అంటున్నారా? విద్యుచ్ఛక్తి మన కంటికి కనబడనంత మాత్రాన ఏం చేస్తుంది లెమ్మని ముట్టుకోగలమా! దాని శక్తిని కాదనగలమా? అలానే రూప రహితుడైన భగవంతుడ్ని దర్శించడానికి మనోనేత్రం కావాలి" ఇలా సాగిపోయింది రంగారావు ఉపన్యాసం.

సభికుల హర్షధ్వానాలే చెప్పాయి ఉపన్యాసం వారినెంతగా ఆకట్టుకున్నదీ!

"ఏవోయ్! ఉపన్యాసంతో భక్తజనాన్ని బాగానే పరవశింపచేశావ్!" అంటూ కాంప్లిమెంట్ చేస్తే, నాలాంటివాళ్ళ ప్రశంసలే తనను ఇంతవాడ్ని చేశాయంటూ తెగ మురిసిపోయాడు.

"కనిపించనంత మాత్రాన దేవుడు లేడని ఎలా అనగలమంటూ ఇవ్వాళ మాట్లాడినవాడివి, అనాడు హేతువాదుల సభలో దేవుడు లేడు లేడంటూ బల్లగుద్ది ఎలా వాదించగలిగావు?" నసిగాను నాకొచ్చిన ధర్మసందేహంతో.

"త్రికరణ శుద్ధిగా నమ్మేదాన్ని, ఆచరించేదాన్ని మాత్రమే చెప్పాలని నీ ఉద్దేశమా? ఉపన్యాసకుడిగా రాణించాలంటే నిర్వాహకుల కమిట్‌మెంట్ మాత్రమే దృష్టిలో పెట్టుకోవాలి. ఆయా సభలకొచ్చే ప్రజల అభిరుచిని ఎరిగి జనరంజకంగా మాట్లాడాలి. ఏదో ఒక కమిట్‌మెంట్‌తో వుంటే అన్నిరకాల ప్రజలకు దగ్గరయ్యేదెలా?" అంటూ ధర్మసూక్ష్మాన్ని నాకే వినబడేలా ఉపదేశించాడు రంగారావు.

అంత గొప్ప ఉపన్యాసకుడి ముందు, సామాన్య సభికుడిని నేనేం మాట్లాడగలను చెప్పండి! ◆